

మంటలు చెలరేగి వాహనం దగ్ధం

విశాలాంధ్ర - మందస : మండలం అంబుగాం గ్రామంలో పార్కింగ్ చేసి ఉన్న వాహనంలో మంటలు చెలరేగి వాహనం దగ్ధమైంది. మంగళవారం ఉదయం అంబుగాం గ్రామంలో పార్కింగ్ చేసిన తుఫాన్ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను చుట్టుపక్కలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగిన తుఫాన్ వాహనం అగ్నికి ఆహుతవగా, పక్కనే ఉన్న మినీ ట్రావెల్ వాహనం పాక్షికంగా దెబ్బతింది. వాహనంలో షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజలు ఆవేదన

- దుకాణాలలో ఎప్పటిలాగే ఒకే ధరలతో వస్తువులు అమ్మకాలు
- దుకాణాలలో ఏ వస్తువులకు జీఎస్టీ తగ్గింది అనే బోర్డు పెట్టాలి
- ప్రస్తుతం స్టాకు ఉన్నంతవరకు ధరలు తగ్గించేది లేదంటున్న దుకాణ యాజమాన్యం

విశాలాంధ్ర - టెక్కలి : జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు ఎలాంటి వస్తువులు పై తగ్గింపు జరిగింది అనే విషయం తెలియక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కిరాణా దుకాణాలలో ఏ వస్తువులపై జీఎస్టి తగ్గింది, ఏ వస్తువుపై తగ్గలేదు అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ధరలు ఎప్పటిలాగే ఉన్నా యని, ఎలాంటి వస్తువులపై ధరలు తగ్గించడం లేదని ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంలో స్థానిక దుకాణాలకు ఇతర గ్రామాల నుండి వచ్చిన ప్రజలు దుకాణాలలో ఏ వస్తువుపై జీఎస్టీ తగ్గిందనే విషయం తెలియక సతమతపడుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తూ ప్రతి వస్తువుపై జీఎస్టి శాతం తగ్గిందని చెబుతుంటే, కానీ టెక్కలి దుకాణాలలో మాత్రం దానికి భిన్నంగా జరుగుతుందని, ప్రస్తుతం స్టాకు ఉన్నంతవరకు ధరలు తగ్గించేది లేదని దుకాణ యాజమాన్యం అంటున్నారని, ఎప్పటిలాగే ధరలు ఉన్నాయని, ఏ వస్తువు పైన కూడా పైసా కూడా తగ్గించడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పత్రం దుకాణాల వద్ద అమిర్చారే తప్ప.. ఏ వస్తువుపై తగ్గింది, ఏ వస్తువుపై తగ్గలేదు అన్నదానిపై స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై దుకాణాలలో ప్రధాన వస్తువులపై ఎంత శాతం జీఎస్టీ తగ్గింది అనేది నమోదు చేస్తూ బోర్డులను ప్రతి దుకాణం వద్ద ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని మరియు ఉన్నత అధికారులకు స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

విశాలాంధ్ర - కవిటి : వన్య ప్రాణులను కాపాడుకోవాలసిన ఆవశ్యకత అందరిపై ఉందని అటవీశాఖ సెక్షన్ అధికారి ఐ.రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవిటి మండలం బట్టివానిపాలెం గ్రామంలో సముద్ర తాబే లుల సంరక్షణపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్ర తీరానికి ఎంతో రక్షణ కల్పిస్తున్న సముద్ర తాబేలులు వలలకు చిక్కినప్పుడు వాటిని ఏవిధంగా సముద్రంలోకి పంపించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీటు అధికారి ఎ.రవికుమార్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు, తాబేళ్ల సంరక్షణ సభ్యులు, మత్స్యకారులు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూలో ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనడానికి వాల్మీకి జీవితమే నిదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, ఎస్వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టిపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం, దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, మంగళవారం జీఎస్‌టీపై విద్యార్థులకు తెలుగు, ఆంగ్లభాష లో ఉపాధ్యాయులు రాము, మురళీధరరాజు, శారదంబ, భాస్కరరావు ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనల్లో 36 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పరిశీలకునిగా దండుగోపాల పురం పంచాయతీ సెక్రెటరీ బమ్మిడి సాయి సిద్ధార్థ వ్యవ హరించారు. పై రెండు అంశాలలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యమములో ఉపా ధ్యాయులు తూట భాస్కర రావు తిరుపతిరావు, జె.శ్రీనివాసరావు, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, బి.శ్రీని వాస్, అన్నాజీ, ఉమ, పి.శ్రీధర్, విజయలక్ష్మి, లక్ష్మణ మూర్తి, డి.శ్రీనివాస రావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు సి.ఆర్.పి గిరి పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలం ధర్మవరం పంచాయతీ రుప్పపేట గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో మం గళవారం నిర్వహించిన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహన రావు ప్రశంసాపత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కె. సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, జి.రమణ, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం పట్ల పలువురు అభినందించారు.

సీజేఐ గవాయ్‌పై దాడి దురదృష్టకరం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండిస్తూ శ్రీకాకుళంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు మంగళ వారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్దకు చేరుకున్న దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ నాయకులు దాడి ఘటనను దురదృష్టకర సంఘటనగా పేర్కొంటూ మానవహారాన్ని నిర్వహించారు. దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను, కంత వేణుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కూడా పాల్గొని సంఘీభావాన్ని తెలియజేసారు. సీజేఐపై దాడికి పాల్పడ్డ నిందితుడుని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. తొలుత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం సీజేఐ గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండిస్తూ నిరసన తెలియజేసి మానవహారం నిర్వహించారు. అనంతరం దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ నాయకులు డా.కంత వేణు,బడే కామరాజు, ముంజేటి కృష్ణ, బాడాన దేవభూషణరావు,రౌతు శంకర్ రావు, ఎం.ఏ రఫి, మహిబుల్లా ఖాన్ లతో పాటు జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పిట్ట దామోదర్ రావు, ఉపాధ్యక్షులు సీతరాజు, ప్రతినిధులు బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు, చలపతిరావు, డి. రాజ్ కుమార్ లు మాట్లాడుతూ సీజేఐ గవాయ్ పై దాడి యత్నాన్ని ఖండించారు. ఈ సంఘటన న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగానే అభివర్ణించారు. ఇటువంటి చర్యలు ప్రమాధకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, నాగరిక సమాజంలో దాడులకి స్థానం లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ నాయకులు వైశ్యరాజు మోహన్, నటుకుల మోహన్, యజ్జల గురుమూర్తి, అర్జి కోటి, పురుషోత్తం రాంబాబు, సంతు, అర్జి ఈశ్వరరావు, కొయిలాపు విజయ్, కొత్తూరు సత్యన్నారాయణ, పెయ్యల చంటి, అబ్బాస్, విజయ్, అఖిల్, రాము, మజ్జి గౌతమ్, రాహుల్, హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థపై జీఎస్టీ ప్రభావం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : జీఎస్టి పై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకొని గ్రామాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేయాలని సరుబుజ్జిలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి పిలుపునిచ్చారు. జీఎస్టీపై విస్తృతమైన అవగాహనలో భాగంగా మంగళవారం సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో జిల్లాలోని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు సైతం జీఎస్టీపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన వివిధ శ్లాబులను, వివిధ పొదుపు మార్గాలను వివరించారు. ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు. 'భారత ఆర్థిక వ్యవస్థపై జీఎస్టీ ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రిన్సిపాల్ పద్మావతి పర్యవేక్షించారు. అంతకు ముందు జీఎస్టీ 2.0పై స్థానికంగా ప్రజలను చైతన్యపరిచేందుకు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివో రమేష్ సాహూ, అధ్యాపకులకు సిబ్బంది పాల్గొన్నారు.

బెలమాంకు స్వచ్ఛాంధ్ర అవార్డు

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస మండలంలోని బెలమాం పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రదానం చేశారు. సోమవారం అంబేద్కర్ కళావేదికలో జరిగిన అవా ర్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన దమయంతి ఈ అవార్డును అందుకున్నారు. పంచాయతీ పరిధిలోని లొద్దలపేట గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేయడం, స్వచ్ఛభారత్ కమిటీ సహకారంతో చెత్త నిర్వహణతో చెత్త సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు నాటడం,సర్పంచ్ సహకారంతో పంచాయతీలో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టడం, సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఆవరణలో పూల మొక్కలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా మార్చడం వంటి పలు కార్యక్రమాలకీ ఈ అవార్డు వచ్చిందని గత పంచాయతీ కార్యదర్శి దమయంతి మరియు సర్పంచి కనుగుల కిషోర్ తెలిపారు.

కొత్తూరు పంచాయతీకి జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డు



విశాలాంధ్ర - కొత్తూరు : జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కొత్తూరు పంచాయతీకి వచ్చిన ఈ అవార్డును ఎంపీడీఓ నీరజకు జిల్లా కలెక్టర్ అంద జేశారు. కొత్తూరు గ్రామ సర్పంచ్ పడాల కృష్ణవేణి, అప్పటి పంచాయతీ కార్యదర్శి సూరిబాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆదేశాల మేరకు కొత్తూరు గ్రామం మొత్తం చెత్త సేకరణ (తడి, పొడి చెత్త), పారిశుద్ధ్య పనుల నిర్వహణ సక్రమంగా నిర్వహించారు దీంతో జిల్లా స్థాయి స్వచ్ఛా అవార్డు కు కొత్తూరు పంచాయతీ ఎంపిక అయ్యింది. ఎంపీడీఓ వి.నీరజకు ఈ అవార్డ్‌ను జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులు మీదుగా అందజేసారు. ఈ అవార్డుల ప్రధానోత్సవంలో శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గోందు శంకర్, బగ్గు రమణమూర్తిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.నీరజతో పాటు కుంటిభద్ర పంచాయితీ కార్యదర్శి కార్తికేయ భట్టు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి

విశాలాంధ్ర - మందస : లగేజ్ వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళ వారం మందస మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. మందస మండలంలోని తంగరపుట్టు గ్రామానికి చెందిన సవర విజయ్ (29) మందస వచ్చి తిరిగి వెళుతుండగా రాయికోలా గ్రామం వద్ద లగేజ్ ఆటో ఢీకొంది. గాయపడ్డ యువకుడిని వైద్యం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మరణించాడు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

విశాలాంధ్ర - కవిటి : క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎదగాలని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. ఈ మేరకు మంగళ వారం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్ బాల్ మరియు త్రో బాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన 28 మంది ఎంపిక అయినందున వారిని ప్రధానోపాధ్యాయులు ఎం.వైకుంఠరావుతో కలసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సరోజ్ జెన్మ పాల్గొని క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, ఎం. తోటారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

14న కొండమహాంకాళి అమ్మవారి సంబరాలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలంలో మెట్టూరు పంచాయితీ ఒంకులూరు గ్రామంలో ఈ నెల 14న కొండ మహాంకాళి అమ్మవారి సంబంరాలు నిర్వ హిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ప్రవా సాంధ్రుడు గుంట వేణుగోపాలరావు లక్ష్మీ దంపతులు ఈ నెల 14వ తేదీన వేణు ఇంటి కుల దేవత కొండమహాంకాళి అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర - హిరమండలం : ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార నది ఉధృతంగా ప్రవహించి నది కి ఒడ్డు న ఉన్న మండలం లోని గులుమూరు గ్రామం పంట పొలాలు ముంపుకు గురై ఆతలా కుతలం కావడంతో మంగళవారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైసీపీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వరి పంట ముంపునకు గురైన రైతులను ఓదార్చారు. ముంపు నకు గురై నష్ట పోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని పత్రికా ముఖం గా తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వెంట మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీ అందవరం వెంకట్ సురేష్, ఎంపీటీసీ బెవర గంగాధర్, కొండ రాగోలు సర్పంచ్ మూకళ్ల చిన్నయ్య, పొట్నూరు సింహచలం, మీసాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఒక లక్ష్యంతో చదవాలి : రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం/ఎచ్చెర్ల : మధ్యాహ్న భోజన పథకంలో ఆహార నాణ్యతలో రాజీ పడకూడదని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల, లావేరు, ఆమదాలవలస మండలాల్లో ఆయన పర్యటించారు. శ్రీకాకుళం అర్బన్ హయాత్ నగర్, నీలంకాలనీ, వరం వీధిలో రేషన్ డిపో, అంగన్వాడీ కేంద్రాలను, ఎచ్చెర్ల మండలంలో అంగన్వాడి కేంద్రం, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు), లావేరు మండలంలో అల్లినగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రం, మురపాకలో కస్తూరి గాంధీ బాలికా విద్యాలయాల ను ఆమదాలవలస మహాత్మాగాంధీ పూలే వసతీ గృహాన్ని, తిమ్మాపురం వద్ద జగ్గుశాసనపేట వద్ద గల కెజిబివిలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని చదవాలన్నారు. అన్నింటికీ చదువే మూలమని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను సక్రమంగా అర్థం చేసుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. మంచి ఉద్యోగంలో స్థిరపడితే తల్లిదండ్రులకు మీ తరుపున అదే మంచి బహుమతి అవుతుందన్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్ యుగం నడుస్తున్నదని, మనం కూడా కాలానికి అనుగుణంగా మారాలన్నారు. మనసుంటే మార్గం ఉంటుందని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. మనలో నైపుణ్యం ఉంటే భవిష్యత్తులో మంచి వృత్తిలో ఉంటామని విద్యార్థులనుద్దేశించి పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పలు చోట్ల పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. భోజనం చేసి వంటకాలను రుచి చూశారు. మెనూ అమలు సక్రమంగా జరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని తెలిపారు. గంజి వడబోయకుండా వండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, పోషణ రంగాల్లో నాణ్యతపై అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంగన్వాడి కేంద్రాలు, పాఠశాల స్టాక్ పాయింట్‌లో ఉన్న సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, సక్రమంగా ఉన్నవీ లేనిదీ తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి గుంట సూర్యప్రకాశ్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు డి. మధుసూదనరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు, డిసిఓవై.యశోదలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ అధికారి బలరామకృష్ణ, ఆహార భద్రత అధికారి లక్ష్మీ, పౌర సరఫరాల డి టి అనిల్ కుమార్, ఎచ్చెర్ల సిడిపిఓ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి...సచివాలయం వద్ద రైతుల ధర్నా

విశాలాంధ్ర - పలాస : మండలం చినంచల పంచాయతీ పరిధిలో గల రైతులు యూరియా కోసం సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచే సచివాలయం దగ్గర పడిగాపులు కాసిన రైతులకు యూరియా ఒక్క బస్తా కూడా అందించలేదని వాపోయారు. యూరియా లభించకపోవడంతో రైతు సచివాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. గ్రామానికి వచ్చిన యూరియా ఓ వర్గం తీసుకున్నారన్నారని ఆరోపించారు. పొట్ట దశలో ఉన్న వరి చేలుకు అధికారులు యూరియా సరఫరా చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం యూరియా సరఫరా చేయకుండా అధికారులు ముఖం చాటేయడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. తమ పొలాల్లో ఒక్కసారి కూడా యూరియా వేయని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల దిగుబడి తగ్గితే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా సరఫరా చేయకుండా వ్యవసాయ అధికారులు అన్నదాతలను నిండా ముంచారని వాపోయారు. రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేస్తామని ప్రగల్భాలు పలికిన అధికారులు యారియా సరఫరా చేయకుండా ముఖం చాటేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతు సమస్యలను పరిష్కరించక పోతే ఆర్డీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో యూరియా మాటకేమో గానీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ పై మరింత అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - మెలియాపుట్టి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టి అనే అంశం పై ప్రతి ఒక్కరు మరింత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నాడు సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టీ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీ కార్యక్రమలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టి కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరూ మరిన్ని విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవిష్యత్ లో ప్రతిదీ జీఎస్టీ పైనే ఆధారపడి ఉంటుందని అనేక అంశాలపై విద్యార్థులకు తెలియపరిచారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో నున్న18 పాఠశాలలో ఆరో తరగతి నుండి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని, పోటీలు అనంతరం ప్రతి సచివాలయంలో నియమించబడిన జీఎస్టీ ఛాంపియన్స్ ఆఫీసర్స్ ద్వారా మొత్తం వివరాలన్నీ అప్లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా మండల విద్యాశాఖధికారులు దేవేంద్రరావు, పద్మనాభం, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయం సిబ్బంది

ఉదయం 10:30ని అయినా కార్యాలయం తలుపులు తెరిచేది లేదు

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : రాష్ట్రంలో బాధ్యతా రాహిత్యమైన ప్రభుత్వ శాఖ ఏదైనా ఉంది అంటే ప్రస్తుతం గ్రామ సచివాలయల పేరు వినిపిస్తుంది. బాధ్యతా రాహిత్యంలో సరుబుజ్జిలి సచివాలయం మొదటి వరుసలో ఉంటుంది. మంగళ వారం ఉదయం 10:30 ని. సమయం దాటినా ఉద్యోగులు కార్యాలయానికి చేరని పరిస్థితి. గతంలో సచివాలయంలో ఆధార్ సెంటర్ ఉండేది కానీ అది మున్నాళ్ళ ముచ్చటే అయ్యింది. ఆధార్ నమోదు ప్రక్రియ, చేర్పులు, మార్పులు జరగడం లేదని పలువురు ప్రశ్నించగా, ఆధార్ యంత్రం మారమ్మత్తులుకు వెళ్లిందని సచివాలయం సిబ్బంది తెలిపారని, అప్పుడు మరమ్మత్తులకు వెళ్లిన యంత్రం ఇప్పటికి రాలేదని, సరుబుజ్జిలిలో ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక గ్రామలకు చెందిన ప్రజలు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల అధికారులకు తెలిపామని, ఫలితం మాత్రం సూన్యమని వారు వాపోయారు. మండల అధికారుల పర్యవేక్షణ లోపంతో సాధారణ పౌరులు తిప్పలు పడుతున్నారు. గతంలో పలుమార్లు సరుబుజ్జిలి సచివాలయం పై పలు పిర్యాదులు వచ్చినప్పటికి మండల అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం పలువురు సిబ్బంది మారినా వారసత్వం మాత్రం మరే పరిస్థితులు కనపడటం లేదు. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చిన్నబాడాం విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - పలాస : శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ నందు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కు సంబంధించి పోటీలలో రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగంలో అథ్లెటిక్స్ విభాగంకు కూర్మపు ప్రణీత్, అండర్ 17 విభాగంలో త్రో బాల్‌కు సవర్ ఆదిత్య ఎంపిక అయ్యింది. ప్రణీత్ ఎంపిక పట్ల స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు టీ గీతను అందరూ కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చింతాడ ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు మనిషికి శారీరిక మానసిక ఆనందాన్నిస్తాయని, అన్నారు.రాష్ట్రస్థాయిలో కూడాను రాణించాలని క్రీడలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించి. స్కూల్ స్థాయిలోనే సరైన తర్ఫీదు ఇచ్చినట్లయితే ఈ దేశానికి మంచి క్రీడాకారులని తయారు చేసే అవకాశం ఈ సమాజానికి మొత్తం కి ఉన్నదని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జి జగదీశ్వర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు గోవింద, షణ్ముఖరావు, నగేష్, లక్ష్మీపతి, ఉమామహేశ్వరరావు మన్మధరావు, జయలక్ష్మి, నిర్మల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిల్ అడ్వాన్స్ కోర్స్‌పై శిక్షణ

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక ఐతమ్ కళాశాల ఈసీఈ విభాగం నాల్గవ సంవత్సర విద్యార్థులకు విభాగ అధ్యాపకులు ఈ. జయ సమన్వయముతో స్కిల్ అడ్వాన్స్ కోర్స్ డేటా అనలిటిక్స్ యూజింగ్ టాబ్ల్యూ అనే కోర్స్ పై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఐటీ రంగంలో డేటా అన లిటిక్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగు ణమైన నైపుణ్యాలను సాధించవచ్చని సూచించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు టాబ్ల్యూ సాఫ్ట్ వేర్‌లో డేటా విజువలైజేషన్, రిపోర్ట్ జనరేషన్ మరియు రియల్ టైమ్ డేటా విశ్లేషణ వంటి ప్రాక్టి కల్ స్కిల్స్ నేర్చుకో దానికి ఎంతో ఉపయోగ పడతాదని తెలిపారు. ఈ శిక్షణకు ట్రైనర్‌గా కె. కృష్ణారాజు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, ఈసీఈ హెడ్ డాక్టర్ అశోక్ కుమార్, అసిస్టెంట్ హెచ్ఒడి డాక్టర్ ఎమ్ఎస్ఆర్ నాయుడు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో జిల్లా ఫస్ట్ సాధించిన 'పడాల'

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టణంలోని లక్ష్మీ నగర్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి పడాల తరుణ్ జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈయన ప్రతిభాపాటవాలు గుర్తించిన న్యాయ నిర్ణేతలు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు తరుణ్ ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపిక చేయటం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో లక్ష్మీ నగర్ పాఠశాల లక్ష్మీ నగర్ పాఠశాల ఉపాధ్యాయులు పేరెంట్ కమిటీ విభాగం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. 12వ వార్డు ఇంచార్జ్ బోయిన వెంకట బాల విద్యార్థిని అభినందించారు. పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత విద్యార్థి పడాల తరుణ్ ను అభినందించారు. పాఠశాల కో ఆప్షన్ సభ్యుడు పొట్నూరు శివకుమార్ మరియు స్కూల్ సిబ్బంది అభినందించిన వారిలో వున్నారు.

సభలు, ర్యాలీలు, ధర్నాలు నిషేదం

విశాలాంధ్ర - పలాస : కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో అక్టోబర్ 1వ తేది నుంచి 31వ తేది వరకు సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలను పోలీస్ 30 యాక్టు అమలులో ఉ న్న కారణంగా ఎటువంటి అనుమతులు లేకుండా సభలు ర్యాలీలు ధర్నాలు నిర్వహించడాన్ని నిషేదించడం జరిగిందని కాశీబుగ్గ ఇన్చార్జ్ డి.ఎస్.పి. ఎల్.డి. లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీసులు అనుమతులు లేకుండా సభలు ర్యాలీలు ధర్నాలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని ఆయన హెచ్చరించారు. దీనిని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు గుర్తించాలని కోరారు.

పేకాటరాయుళ్లపై ఉక్కుపాదం

విశాలాంధ్ర - సోంపేట : కంచిలి పోలీసులు పేకాటరాయుళ్లపై ఉక్కు పాదం మోపుతున్నారు. ఎస్సై పి.పారినాయుడు ఆధ్వర్యంలో గ్రామాల్లో జరుగుతున్న పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే కంచిలి మండలం సూదివుట్టుగ గ్రామంలో 13 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో నగదు, ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న సంగతి తెల్సిందే. ఈవిషయంలో రాజీ పడకుండా తాజాగా సోమవారం రాత్రి సిర్తలి గ్రామం కొత్తచెరువు గట్టుపై అర్ధరాత్రి పేకాట శిబిరంపై ఎస్సై పారినాయుడు సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారి నుంచి 41,100 రూపాయలు నగదు సీజ్ చేశారు. పేకాట ఆడుతున్న కంచిలి బిపి కాలనీకి చెందిన ఓగిరాల ప్రతాప్, ఎంఎస్‌పల్లికి చెందిన పైల శ్రీనివాసరావు, బుడ్డు లింగరాజు, ఎఎస్‌పల్లికి చెందిన కొరికాన జంపయ్య, సిర్తలికి చెందిన పానికేళ్ల దానయ్య, పెద్దఅంపురంనకుచెందిన మజ్జి ఢిల్లేశ్వరరావు, జిల్లుండకు చెందిన అరుణ్ గౌడలపై కేసు నమోదు చేశారు.

సీజనల్ వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- పంట నష్టంపై తక్షణ నివేదిక తయారు చెయ్యాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజారోగ్యంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక దృష్టి సారించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, డయేరియా కేసులను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా నీరు నిలువకుండా చూడాలని, కాలువల శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో వివిధ శాఖల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

- ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత...

ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, తాగునీటి నమూనాలను త్వరితగతిన పరీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలతో నీరు నిలువ ఉన్న దృష్ట్యా, రానున్న వారం రోజుల పాటు ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చేతి శుభ్రత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సంపూర్ణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలోని 159 హాస్టల్స్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

- పంట నష్టంపై నివేదికకు ఆదేశం...

భారీ వర్షాల కారణంగా జిల్లాలో 16 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా సంతబొమ్మాళిలో 400 హెక్టార్లు, పాతపట్నంలో 250 హెక్టార్లు, కొత్తూరు, హిరమండలంలో 100 హెక్టార్ల చొప్పున నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. ధాన్యం మొలకెత్తడం, ధాన్యం పొట్టు దశలో నీరు చేరడం, పూత వాష్ ఔట్ అవ్వడం వంటి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పంట నష్టంపై తక్షణమే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. పంట నమోదు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరిపాలన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, ప్రతి అధికారి ప్రజా సానుకూల దృక్పథంతో క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, ప్రజా సేవల్లో ఫలితాలు కన్పించేలా పని చేయాలని ఆదేశించారు. పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించాలన్నారు. అరసవల్లి దేవస్థానం భక్తులకు అందించిన సేవల్లో ఈ వారం రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడం పట్ల కలెక్టర్ అభినందించారు. ఇంజినీరింగ్ పనుల్లో పూర్తయిన వాటికి బిల్లులు పెండింగ్ లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగులంతా ఐ గాట్ కర్మయోగి కోర్సులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇంటింటికీ జీఎస్టీ ఫలాలపై ప్రచారంలో పురోగతిపై కలెక్టర్ సమీ క్షించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ టీమ్, ఎస్‌హెచ్‌జీలు, వీఓలు ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ, నిత్యావసర వస్తువులపై వినియోగదారులకు లభించే విలువను వివరించాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న జీఎస్టీ ఉత్సవాల్లో లోటుపాట్లు లేకుండా చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా సేవల నాణ్యతను పెంచడమే తమ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి. పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంను జగనన్నకు కానుకగా ఇద్దాం : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపిని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్వగృహం కొత్తపుట్టుగ వద్ద సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ శాసన మండలిలో ఇచ్ఛాపురం నియోజక వర్గంలో దశాబ్దాలుగా ప్రజలను విసిగిస్తున్న సమస్యలు, అభివృద్ధిపై కూటమి నాయకుల వైఫల్యాలపై ప్రశ్నించడంతో కూటమి నాయకుల్లో భయం పుట్టిందని అన్నారు. తమ నాయకుడు కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలో మొత్తంగా పదిసార్లు పైబడి కౌన్సిల్లో ప్రజా సమస్యలపై గళం విప్పారని స్పష్టం చేశారు. గత బడ్జెట్ సమావేశాలలో కూడా మత్స్యకారుల, బెంతొరియా,వంశధార నదుల అనుసంధానం, నియోజకవర్గం లో రహదారుల పరిస్థితులు, కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలపై మండలిలో మాట్లాడిన అంశాలను నియోజకవర్గ ప్రజల దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన తమ గొంతు విప్పుతుందని ఈ శాసనమండలి సమావేశాలు నిరూపించినట్లు స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రజా సమస్యలు లేవనెత్తి ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకుడు ఎవరు అనేది ఇప్పటికైనా ప్రజలు గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఇదంతా జగనన్న ఇచ్చిన అవకాశంతోనే చేయగలిగానని,వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో వైకాపా జెండా ఎగరవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు తెలిపారు. ప్రజా నాయకుడు అంటే ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని అన్నారు. 37 సంవత్సరాలుగా నియోజకవర్గాన్ని పాలిస్తున్న తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 90 శాతం ప్రజలు వ్యవసాయ, ఉద్యాన రంగాల పైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారనీ ఆ రైతాంగానికి గాని, రైతు కూలీలకు కానీ ఉపయోగపడే వ్యవస్థలను ఏర్పాటు చేయకపోగా,ఉన్న సాగునీటి వనరులను కూడా వినియోగం లోకి రాకుండా చేసేసారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం జరిగాక పదిసార్లు ఎన్నికలు జరిగితే, తొమ్మిది సార్లు విజయం సాధించామని గర్వంగా చెప్పుకుంటున్న నాయకులా ప్రజా సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని అన్నారు. ఇచ్ఛాపురం నియోజక వర్గ అభివృద్ధికి ఇది మేము చేసామంటూ, చెప్పుకునే దానికి ఒక్క అభివృద్ధి పనైనా జరిగిందా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రీ గోపయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ పిఎం తిలక్, వైసిపి నాయకులు బెందాళం జయప్రకాష్, ఎస్పీ నారాయణ స్వామి, ఎన్ని. అశోక్, ఎన్.బాబు రావు, బర్ల నాగభూషణం, కాయ భీమ్సేన్, కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం, హిరమండలంలో సబ్ రిజిస్ట్రర్ల కార్యాలయాలు నిర్మించండి

ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : నియోజకవర్గకేంద్రం లో నిపాతపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడం, హిర మండలం సబ్ రిజెస్టర్ కార్యలయం అద్దె ప్రాతి పదికన రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తుండంతో అక్కడ కూడా శాశ్వత భవనం నిర్మించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు.

శివ లింగాన్ని తాకిన సూర్యకిరణాలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం ముత్యాలపేట గ్రామంలోని వెలసిన మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో మంగళ వారం శివలింగాన్ని ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని పూజారి, ఆలయంకు వచ్చిన భక్తులు చూసి గ్రామంలో చెప్పడంతో గ్రామస్తులు గ్రామంలోని భక్తులు శివాలయంకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాతిన చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీఎస్టీపై ర్యాలీ, చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - పలాస : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న పన్ను సంస్కరణలలో జీఎస్టీ తగ్గింపు విషయమై పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పలాసలో మంగళవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కలిగించారు. ఈ తగ్గింపు వలన చిన్న, మధ్యతరగతి వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని, ఆర్థిక వృద్ధి రేటు 2శాతం వరకూ పెరగొచ్చని, పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ప్రయోజనమని అధ్యాపకులు వివరించారు. ఈ విషయమై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ నరసింహమూర్తి మార్గదర్శకత్వంలో అధ్యాపకులు రామ్మోహన్ దొర, సరస్వతి, రమేష్, యుగంధర్, తపన్ కుమార్ జెనా, ప్రసాదరావు, జయప్రకాష్, ప్రవీణ్, సాగరిక, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుబాబు, వాసుదేవరావు, పాపా రావు, వాలంటీర్లు ఇందులో భాగస్వాములయ్యారు.

పీఏసీఎస్ భవనానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - కవిటి : కవిటి పీఏసీఎస్ శాశ్వత భవనం మంజూరు అయినదని దానికి స్థలం కేటాయించాలని పీఏసీఎస్ అధ్యక్షులు యర్ర బాసుదేవ ప్రధాన్ కోరారు. ఈ మేరకు మంగళ వారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ని రామయ్య పుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయను కలసి జీవో కాపీని అందించి స్థలం కేటాయించాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ సబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి భవనానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో బి.చిరంజీవి, బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్, యర్ర దుర్యోధన, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

గిరిజన వృద్ధురాలికి 'అభయం' రక్తదానం

విశాలాంధ్ర - టెక్కలి : మెళియపుట్టి మండలం, రాయకోల గ్రామానికి చెందిన సవర తులసమ్మ అనే 85 ఏళ్ల మహిళ ఆరోగ్యం బాగోలేదని టెక్కలి జిల్లా హాస్పిటల్ కి వచ్చింది. వైద్య పరీక్షలు జరిపిన వైద్యులు ఆమె శరీరం లో రక్తం చాలా తక్కువ వుందని, వెంటనే బి పోజటివ్ రక్తం ఎక్కించాలని సూచించారు. రక్తదానం చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో రక్త దాతల కోసం ఎదురుచూస్తున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం సేవా సంఘం వాళ్ళు వెంటనే స్పందించి టెక్కలి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఒక ప్యాకెట్ బి పోజటివ్ రక్తం ను అందించినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మూగి దుర్గారావు, హాస్పిటల్ సిబ్బంది, రోగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - పలాస : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లల్లో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని..ఇందులో భాగంగా పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో: డాక్టర్. వి. కణితీస్. ప్రభుత్వ ఐటిఐలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్స్ ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పైల జవహర్ , జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి ఉరిటి. సాయి కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆ పైన పాసైన విద్యార్హత కలిగి 18-35 ఏళ్ల లోపు వయసున్న స్త్రీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ల తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారని.. ఆశక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికేట్స్, ఆధార్ జెరాక్స్ మరియు 2 పాస్పోర్ట్ ఫోటోలతో హాజరు కాగలరని తెలిపారు. వివరాల కోసం హబ్ కోఆర్డినేటర్ ఆర్ సోమేశ్వర రావు 6301046329 నంబర్ కు సంప్రదించాలని సూచించారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

విశాలాంధ్ర - టెక్కలి : వాల్మీకి జీవితం ఆదర్శనీయమని అంగన్వాడి కార్యకర్త హెచ్. వాణిశ్రీ అన్నారు. మండలంలోని స్థానిక వంశధార కాలనీ లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణంలో వాల్మీకి దాదాపు 20 వేల శ్లోకాలు రాశారని గర్భిణీలకు తెలిపారు. ఆయన జీవిత చరిత్ర కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సహాయకురాలు కె. విజయ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి : కంచిలి మండలం కేశరపడ పంచాయతీలో ప్రారంభం కానున్న భూముల రీసర్వేపై మంగళవారం అధికారులు సిబ్బంది గ్రామసభ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ సర్వేయర్ చంద్రశేఖర్, రీసర్వే డిటి కె.శ్రీనివాస్, మండల సర్వేయర్ల ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, మాజీ జెడ్పీటీసీ ఇప్పిలి కృష్ణారావు, ఎంపీటీ మెండ హేమావతి ప్రకాష్, సర్పంచ్ పప్పల చంద్రమ్మ యుగంధర్ తదితరుల సమక్షంలో గ్రామసభను నిర్వహించారు. కేశరపడ గ్రామ రెవెన్యూపరిధిలో జరగనున్న భూముల రీసర్వే సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూముల రీసర్వే ద్వారా రైతులకు పక్కాగా హక్కులు కల్పించడం, గతంలో జరిగిన పొరపాట్లు సరి చేయడం, రైతుల భూములకు కొత్తగా డాక్యుమెంట్లు అందజేయడం వంటి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

మల్లన్న, సంతోషిమాత అమ్మవారి ఆలయాల హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ సంతోషిమాత అమ్మవారి దేవస్థానం మరియు రావివలస గ్రామంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయాలలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు సమీక్షంలో అమ్మవారు హుండీ లెక్కించగా 90 రోజులుకు గాను రూ. 25,569/- ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే ఎండల మల్లన్న హుండీ లెక్కించగా 126 రోజులకు గాను రూ.1,50,556 వచ్చినట్లు ఆలయ ఈఓ గురునాధరావు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ ఈఓ టీపి మనస్వి, సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు పలు కాంపిటేషన్‌లు

విశాలాంధ్ర - హిరమండలం : మండల కేంద్రం హిరమండలం 3 సచివాలయం పరిధిలో ని సుభలయ ఆర్ అండ్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం విద్యార్థులకు జీఎస్టీపై వ్యాసరచన, ప్రకృత్వ, పెయింటింగ్ పోటీలు పలు పోటీలు ఉపాధ్యాయులు మండల అధికారులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలప్రత్యేక అధికారి బి.రాజ్‌గోపాల్, తహసీల్దార్ ఎన్ని జోగారావు, ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్, హిర మండలం పంచాయతీ ఈఓ మూల భాస్కర్‌రావులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. సూపర్ జి ఎస్టీ అంటే గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అని ఇది మన దేశంలో 2017 లో ప్రారంభించారని జీఎస్టీ తగ్గింపు పై వినియోగదారులకు మరింత మేలు చేకూరుతుందనివారన్నారు. జీఎస్టీ తగ్గింపు వాణిజ్య కేంద్రాలు ముందు ప్రదర్శన చేసి వినియోగదారులకు తెలియజేయాలనీ ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. సచివాలయం సిబ్బంది, ఎంఈఓ కే.రాంబాబు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో ఆముదాలవలస పట్టణంలో భారతదేశంలో జరుగుతున్న ఎన్నికల అవక తవకలు మరియు ఓటర్ జాబితా అవకతవకలపై రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా ఓటు చోరీపై సంతకాల సేక రణ కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆయ న మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం మరియు బిజెపి కలిసి భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తు న్నాయని ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే హక్కు వాళ్ళకి కల్పించడం లేదని విమర్శించారు. వేస్తున్న ఓట్లు తారుమారై భారతీయ ప్రజాస్వామ్యం పైన తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రాహుల్ గాంధీ చేస్తున్న పోరా టానికి మద్దతు పలికారు. ఆముదాలవలసలో ఓటు చోరీ కార్యక్రమం పై సంతకాల సేకరణ ప్రారంభించామని రానున్న రోజుల్లో మా అధినాయకత్వం ఆదేశాల మేరకు ఓటు చోరీపై తీవ్రంగా పోరాడి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని మన ఓటు మన హక్కు మన బాధ్యత అనే విధంగా ప్రజల్లోంచే మార్పు వచ్చే విధంగా పోరాటాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లఖినేని నారాయణరావు, బసవ షణ్ముఖ రావు, సనపల రాజులు, లఖినేని సాయిరాం, పప్పల అప్పారావు, సీపాన శ్రీరాములు, సువ్వారి రమణ,రాజేష్, రమేష్,పూజారి త్రినాధరావు తదితరు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు



విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్, పొన్నాడ రాజశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో ధ్యానం, యోగా చేయించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు ప్రతీరోజూ ధ్యానం, యోగా చేయటం వలన మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల శరీరంలో అన్ని అవయవాలు చైతన్యవంతం అవుతాయని, మానసిక ఆరోగ్యంపై ప్రతీ విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్, టి.అప్పన్న విద్యార్థులచే యోగా, ధ్యానం చేయించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య కౌన్సిలర్లను నియమించటం పట్ల విద్యార్థుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వకుళ రత్నమాల అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణీలు, బాలింతలకు పోషకాహారాలపై అవగాహన

విశాలాంధ్ర - పోలాకి : గర్భిణీలు బాలింతలకు పోషకాహారాలపై అంగన్వాడి కేంద్రాల్లో మాసోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట ప్రాజెక్టు అధికారి పి.శోభారాణి తెలిపారు. మంగళవారం బాడ్డిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు పోషకాహారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సనపల సోమేశ్వరరావు అడ్వకేట్ ప్రగడ ఆనందరావు ఎసిడిపిఒ అనురాధ సూపర్వైజర్ కామేశ్వరి అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయనకి ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడండి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ప్రస్తుతం ఖరీఫ్ వరి పంటలో రైతులు రసాయనకేరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని టెక్కలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్మోహన్రావు అన్నారు. మంగళవారం కోటబొమ్మలి మేజర్ పంచాయితీ పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పంటలో చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు కోసం వివరించారు. చీడపీడల నివారణకు పొటాషియం పొటాషియం భాస్వరం వంటి ఎరువులను వినియోగించాలని సూచించారు. పంట సమయంలో దోమపోటు రాకుండా ఉండేందుకు మధ్యలో దారిలో తీసుకోవాలని వంటి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక వ్యవసాయ అధికారి సువ్వారి గోవిందరావు, సిబ్బంది. పలువురు రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ-2.0పై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని 26 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం జీఎస్టీ-2.0పై వ్యాసరచన, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. మండల విద్యా శాఖాధికారులు-1,2 జి.శాంతారావు, పి.దాలినాయుడు ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ-1, శాంతారావు మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు తాము కొనుగోలు చేసే వస్తువులపై గతం కన్నా 28శాతం జీఎస్టీ నుండి 18శాతం తగ్గించిందని, దీని ద్వారా ప్రతీ కుటుంబానికి తాము కొనుగోలు చేసే వస్తువులపై సుమారు రూ.10వేలు ఆదా అవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరికీ తెలియచేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు జీఎస్టీ-2.0పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పోటీ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు ఎం.ఈ.ఓ, శాంతారావు, దాలినాయుడు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో 26 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం, దండు గోపాలపురం రైల్వే స్టేషన్ సమీపంలో గల వడ్డితాండ్ర రైల్వే క్రాసింగ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రైలు కింద పడి మృతి చెందారు. ఈయన వయసు 30 నుంచి 35 సంవత్సరాలు మధ్య ఉంటుంది. కాఫీ కలర్ ఫుల్ హాండ్స్ షర్ట్ ధరించి ఉంది. ఎడమచేతి రెండువేళ్ళకు గోరింటాకు పెట్టి ఉంది. ఆచూకీ తెలిసినవారు, జి ఆర్ పి ఎస్, హెడ్ కానిస్టేబుల్ డి హరినాథ్ 9989136143 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- ఘనంగా 2002-03 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 2లక్షల రూపాయిలు విరాళంగా ప్రకటించి బడి రుణం తీర్చుకున్న విద్యార్థులు

విశాలాంధ్ర - పోలాకి : మండలంలో కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హెూదాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి వారి చిన్న నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేర్చిన నాటి గురువులకు పాద పూజ చేసి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. వర్షం పడితే విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, బాడాన రాజు ద్వారా తెలుసుకున్న పూర్వ విద్యార్థులు పెద్ద మనసుతో రెండు లక్షల రూపాయిల భారీ విరాళంతో తమ ఉదారత చాటుకున్నారు. ఈ మొత్తం తో అన్ని హంగులతో పాఠశాలలో బోజన శాల నిర్మిస్తామని ప్రకటించి బడి రుణం తీర్చుకున్నారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల చరిత్రలోనే రెండు వందల మందికి పైగా విద్యార్థులు కలిగిన అతి పెద్ద 10వ తరగతి బ్యాచ్ గా రికార్డు సృష్టించిన ఈ 2002 - 03 బ్యాచ్ పాఠశాల అభివృద్ధిలో సైతం పెద్దమనసు తో ముందుకు రావడం హర్షణీయం అని ఉపాధ్యాయులు ప్రశంసించారు. కాసేపు అందరూ తమ వయస్సు, హెూదా మరిచి ఆటపాటలతో అలరించడం ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు బెండి నాగ రాజు, సనపల అరవింద్, దాసరి పురుషోత్తమ్‌త, సనవల అప్పల స్వామి బాబు, బుజ్జి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, విద్యా కమిటీ చైర్మన్ చింతాడ గున్నమ్మ, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణ రావు, బాడాన రాజు, చింతాడ దిలీప్ కుమార్, నాటి గురువులు మల్లేశ్వరరావు, రాజారావు, సోమేశ్వర రావు, సత్యప్రభ, ప్రసాద రావు, రామారావు, సత్యం, గణపతి రావు, అర్జునుడు, మెట్ట రామారావు, వైకుంఠ రావు, గోవింద బాబా, శ్రీనివాస శర్మ, నాగభూషణ రావు, జితేంద్ర, సాలిన రమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, గిరి, రామ్ కుమార్, చంద్రయ్య, ఆనంద్, గోపి, కుర్మారావు, అప్పల నరసింహం, పూర్వ విద్యార్థులు అరవింద్, నాగ రాజు, అప్పలస్వామి బాబు, పురుషోత్తం, పూర్ణ, బుజ్జి, నారాయణ, రామారావు, తిరుపతి, ఆదినారాయణ, భారతి, శ్యామల, గోపమ్మ, నరేష్ పాల్గొన్నారు.